క్లుప్తంగా

నేడు శాస్త్రవేత్త నాయుడమ్మ 38వ వర్ధంతి

తెనాలి: తెనాలి ప్రాంతానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త పద్మశ్రీ డాక్టర్ యలవర్తి నాయుడమ్మ 38వ వర్ధంతి రోజైన శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక మార్కెట్‌యార్డు వద్ద గల ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించనున్నారు. కుమార్ పంప్స్ అండ్ మోటార్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొని డాక్టర్ నాయుడమ్మకు శ్రద్ధాంజలి ఘటించాలని డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ చైర్మన్ యడ్లపాటి రఘునాధబాబు విజ్ఞప్తిచేశారు.

క్రీడలు సమాజానికి ఎంతో అవసరం

తెనాలి: క్రీడలు సమాజానికి ఎంతో అవసరమని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కాలేజీ మైదానంలో కేబీఎస్ అండ్ కేవైఆర్ క్రికెట్ టోర్నమెంటులో విజేతలకు ఆలపాటి చేతులమీదుగా బహుమతులను, ట్రోఫీలను అందజేశారు. 18 జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో మారుతి లెవెన్ జట్టు విజేతగా నిలిచింది. తాడిబోయిన హరిప్రసాద్, దేసు యుగంధర్, అత్తోట శరత్, నలుకుర్తి రమే, కుదరవల్లి శ్రీనివాసరావు, విజయ్‌కుమార్, ఫణిదపు దుర్గ, పాశం వెంకటేశ్, కృష్ణబలిజ సంఘం యువత అధ్యక్షుడు కావేటి గోపీనాథ్, సంఘ నాయకులు యర్రంశెట్టి వేణు, పాశం రవి, కోలా శేఖర్ పాల్గొన్నారు.

తెనాలిలో కుండపోత



తెనాలిఅర్బన్: తెనాలిలో బుధవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోత పోస్తుండగా సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు వర్షం కురుస్తునే వచ్చింది. దీంతో పట్టణంలోని దాదాపు అన్ని ప్రధాన రహదారులు జలమయ్యామయ్యాయి. అలాగే మురుగు కాల్వలు పొంగి రోడ్డుపై మురుగు చేరింది. సాయంత్రం కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు కొంత ఇబ్బంది పడ్డారు. అయితే వాతావరణం అంతా చల్లగా మారడంతో సేదతీరారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

తెనాలి: పట్టణ సుల్తానాబాద్‌లో ఒక ఇంటి ఎదుట ఉంచిన ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి దగ్ధం చేశారు. వాహనం యజమాని గురువారం ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు...

తెనాలి: యువతి పట్ల అసభ్య ప్రవర్తనపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. సత్తెనపల్లికి చెందిన ఒక యువతి 2022 డిసెంబరులో స్థానిక అయితానగర్‌లోని పెద్దమ్మ ఇంటికి వచ్చింది. ఆ సందర్భంగా పెద్దమ్మకు తెలిసిన వ్యక్తి ఒకరు ఆ యువతితో అసభ్యంగా ప్రవర్తించారు. దీనిపై ఆ యువతి అక్కడ స్పందనలో ఫిర్యాదుచేయటంతో ఆ ప్రకారం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

ఉన్న చోటనే పట్టాలు ఇవ్వాలి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట ఫారెస్ట్ ప్రాంతంలో నివాసముంటున్న తమకు నివాసం ఉన్నచోటనే స్థలాలకు పట్టాలు ఇవ్వాలని గురువారం సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ నులకపేట ఫారెస్ట్ ప్రాంతంలో సుమారు 2 వేల మంది నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని, ఫారెస్ట్ ప్రాంత వాసులకు రాజధాని వివిధ గ్రామాల్లో ఆర్-5 జోన్‌లో సెంటు స్థలం కేటాయించారని, అంత దూరం వెళితే ఉపాధి పోతుందని, ఉన్న చోటనే ఫారెస్ట్ ప్రాంతాన్ని డీ ఫారెస్ట్ చేసి పట్టాలు మంజూరు చేయాలని కోరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వేముల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యావిధానంపై అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాలలోని డాక్టర్ కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాలలో ఎన్ఈపీ 2020 (జాతీయ విద్యావిధానం 2020)పై గురువారం విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ కె.గిరిధరరావు మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం 2020 సంస్కరణల్లో భాగంగా 4 సంవత్సరాల ఆనర్స్ డిగ్రీ గురించి వివరించారు. సింగిల్ సబ్జెక్టు మాత్రమే ప్రధానంగా తీసుకుని మిగిలిన సబ్జెక్టులలో నిర్దిష్ట సంఖ్యలో మార్కులు పొందాల్సి ఉంటుందని వివరించారు. సబ్జెక్టుల ఎంపికలో విద్యార్థులకు పూర్తి స్వేచ్ఛ ఉంటుందని, 4 సంవత్సరాల ఆనర్స్ డిగ్రీ తర్వాత ఏడాది పీజీ ఉంటుందని, లేదా పీహెచ్‌డీలో నేరుగా చేరవచ్చని తెలిపారు. ఏడాది సర్టిఫికెట్, 2 సంవత్సరాల డిప్లమో, 3 సంవత్సరాల తర్వాత డిగ్రీ ఇవ్వబడతాయని తెలిపారు. విద్యార్థులు ఏదైనా కారణం వల్ల మధ్యలో విద్యాభ్యాసం ఆపివేసినా తిరిగి మరలా కొనసాగించవచ్చని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ టి.రాఘవరెడ్డి, కె. సరళాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాంబాబు, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదలపై అనుగ్రహం

పేదల సొంతింటి కల సాకారం చేసిన సీఎం వైఎస్ జగన్



• ఈమె పేరు రావూరి కనకదుర్గ. భర్త రావూరి దాసయ్య, భర్త లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. వీరు తెనాలి పట్టణంలో గత 30 ఏళ్లుగా అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. చాలీచాలని సంపాదనలో సగం ఇంటి అద్దెలు కట్టేందుకే సరిపోయేది. ఒక్కోసారి పనులు లేక అద్దెలు కట్టలేక.. ఇంటి యజమానులకు చెప్పుకోలేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. గతంలో ఎన్నోసార్లు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నా వీరికి స్థలం రాలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పెదరావూరులోని జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ప్రభుత్వమే ఇల్లు కట్టించి ఇచ్చింది. దీంతో వీరి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. 30 ఏళ్లుగా సొంతిల్లు లేక ఎన్నో ఇబ్బందులు పడ్డామని.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తమ బాధలు తొలగించారని ఆనందభాష్పాలతో కనకదుర్గ కృతజ్ఞతలు తెలిపింది. భర్త అనారోగ్యంతో హాస్పటల్‌లో ఉండటం వలన గృహ ప్రవేశం చేయలేదు. త్వరలో వీరు నూతన ఇంటిలోకి వెళ్లనున్నారు.



కాలనీలో ఏర్పాటు చేసిన అంతర్గత రోడ్లు, విద్యుత్ సదుపాయం

- తెనాలి పట్టణంలో 23,904 ఇళ్ల పట్టాలు పంపిణీ
- మొదటి విడత కింద చేపట్టిన 10,225 ఇళ్ల నిర్మాణాలు
- శరవేగంగా జరుగుతున్న పనులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

తెనాలిఅర్బన్: పేదల సొంతింటి కల సాకారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా గతంలో ఎన్నడు లేని విధంగా తెనాలి పట్టణంలోని పేదలకు పెద్దఎత్తున ఇళ్ల స్థలాలు ఇవ్వటమే కాకుండా మొదటి విడత కింద కొన్ని ఇళ్ల నిర్మాణాలను చేపట్టి వాటిని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. దీంతో పేదల మోములలో ఆనందం వ్యక్తం అవుతుంది.

పట్టణ పరిధిలో 23,904 మంది పేదలకు..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో రెవెన్యూ అధికారులు అయితానగర్, గోలిడొంక, పెదరావూరు, జగ్గడిగుంటపాలెం, బుర్రిపాలెం, నేలపాడు పరిధిలో భూములను కొనుగోలు చేశారు. అనంతరం వాటిని ప్లాట్స్‌గా విభజించి తెనాలి పట్టణ పరిధిలోని 23,904 మంది పేదలకు వాటిని పంపిణీ చేశారు. అనంతరం వాటిలో మెరకతోలి వాటిని అభివృద్ధి చేశారు. అలాగే గ్రావెల్‌తో అంతర్గత రోడ్లు, విద్యుత్ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. మొదటి విడత కింద 10,225 మందిని ఎంపిక చేసి నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు.

శరవేగంగా జరుగుతున్న నిర్మాణ పనులు..

పెదరావూరు జగనన్న కాలనీలో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. అక్కడ మొదటి విడత కింద 1841 ఇళ్ల నిర్మాణాలలో ఇప్పటికే 172 ఇళ్లు పూర్తి అయ్యాయి. మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయి. అలాగే బుర్రిపాలెం జగనన్న లేఅవుట్‌లో 3337లో ఇప్పటికే 61 ఇళ్లు పూర్తి అయ్యాయి. మిగిలిన లేఅవుట్‌లలో పనులు కొనసాగుతున్నాయి.

బుర్రిపాలెం లేఅవుట్‌లో...

మంజూరైన ఇళ్ల స్థలాలు	: 9812
నిర్మాణంలో ఉన్నవి	: 3337
బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నవి	: 1786
పూర్తయిన ఇళ్ల సంఖ్య	: 61

నేలపాడు లేఅవుట్‌లో..

మంజూరైన ఇళ్ల స్థలాలు	: 5715
నిర్మాణంలో ఉన్నవి	: 2182
బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నవి	: 755
పూర్తయిన ఇళ్ల సంఖ్య	: 31

గోలిడొంక లేఅవుట్‌లో...

మంజూరైన ఇళ్ల స్థలాలు	: 1982
నిర్మాణంలో ఉన్నవి	: 1785
బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నవి	: 06
పూర్తయిన ఇళ్ల సంఖ్య	:03

పెదరావూరు లేఅవుట్‌లో...

మంజూరైన ఇళ్ల స్థలాలు	: 3792
నిర్మాణంలో ఉన్నవి	: 1841
బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నవి	: 1174
పూర్తయిన ఇళ్ల సంఖ్య	: 172

మూడో ఆప్షన్‌కే ఓటు..

• పేద ప్రజలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇళ్లు నిర్మించుకునే వారికి మూడు రకాల ఆప్షన్స్ ఇచ్చింది.

మొదటి ఆప్షన్: లబ్ధిదారులే ఇంటి మొత్తాన్ని నిర్మించుకుంటే ప్రభుత్వం వారి బ్యాంక్ ఖాతాలో రూ.1.80 లక్షల నగదును మంజూరు చేస్తుంది. ఇసుక, ఇనుము, సిమెంట్, కిటికీలు, తలుపులు మొదలగు సామగ్రిని రాయితీపై ఇస్తుంది.

రెండో ఆప్షన్ : ఇసుక, ఇనుము, సిమెంట్, కిటికీలు, తలుపులు మొదలగు సామగ్రిని ఉచితంగా ఇచ్చి, మిగిలిన పని పూర్తి చేయించుకున్నందుకు ప్రభుత్వం నగదు ఇస్తుంది.

మూడో ఆప్షన్ : పూర్తిగా ఇంటిని కాంట్రాక్టర్‌తో నిర్మించి ఇవ్వటం మూడో ఆప్షన్. అయితే ఎక్కువ మంది కాంట్రాక్టర్‌లతో కట్టించి ఇవ్వాలని కోరారు. దీంతో అందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంది.

జగ్గడిగుంటపాలెం లేఅవుట్‌లో...

మంజూరైన ఇళ్ల స్థలాలు	: 2603
నిర్మాణంలో ఉన్నవి	: 1080
బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నవి	: 248
పూర్తయిన ఇళ్ల సంఖ్య	: 16



పెదరావూరులో లబ్ధిదారుడు నిర్మించుకున్న ఇల్లు



పెదరావూరు జగనన్న కాలనీ

టిష్యు కల్చర్ అరటి సాగుకు ప్రోత్సాహం

మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని నూతక్కిలో గురువారం రైతులకు టిష్యు కల్చర్ అరటి సాగుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు మాట్లాడుతూ ఉద్యాన శాఖ టిష్యూ కల్చర్ అరటి మొక్కల సాగు ప్రోత్సహిస్తూ 2.5 ఎకరాలకు రూ.30వేల సబ్సిడీని అందజేస్తుందన్నారు. రైతులు సంఘాలుగా ఏర్పడి కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూమ్‌లు నిర్మించుకుని ఉపయోగిపెట్టుకోవాలని సూచించారు. సల్ఫర్ మిల్స్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ రాజశేఖరరెడ్డి సల్ఫర్, జింక్ పోషకాలు అవసరం గురించి, నేలలో సమతుల్యం, ఈ ఆర్గానిక్ ఉత్పత్తుల వినియోగం గురించి క్షుణ్ణంగా రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారి దీపిక, నూతక్కి ఉద్యాన సహాయకులు రాజేశ్వరి, ప్రశాంత్, దివాకర్‌లతోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

కంతేరులో ఇరువర్గాల దాడి

కంతేరు(తాడికొండ): మండల పరిధిలోని కంతేరు గ్రామంలో ఇరువర్గాలకు చెందిన యువకులు పరస్పరం దాడులు చేసుకున్నారు. పలువురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మామిడితోట వద్ద ఇరువర్గాలకు చెందిన యువకుల మధ్య వాగ్వివాదం జరిగింది. మాట మాట పెరిగి దాడులకు దిగారు. ఎస్సీ కాలనీకి చెందిన యువకులకు తలలు పగిలి తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన యువకులను జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

ముస్లిం మైనార్టీలపై పవన్ కల్యాణ్‌ది కపట ప్రేమ

తాడేపల్లిరూరల్: జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఎన్నికలు దగ్గర పడడంతో ఓట్ల కోసం ముస్లిం మైనార్టీలపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధానకార్యదర్శి షేక్ సుభాని అన్నారు. గురువారం దుగ్గిరాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మతతత్వ బీజేపీతో ప్రయాణం సాగిస్తున్న పవన్ ముస్లింలకు అండగా ఉంటానని ముస్లిం ప్రతినిధులతో చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్ ముస్లింలను డెప్యూటీ సీఎం చేయడంతోపాటు అనేక నామినేటెడ్ పోస్టుల్లోనూ ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి, ముస్లింల అభివృద్ధికి, సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నారని అన్నారు.

గరిష్ట ప్రయోజన కల్పనకే 'జగనన్న సురక్ష'

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- జగనన్న సురక్షపై సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లకు శిక్షణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్. వేదికపై అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు

తెనాలి: రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఎలాంటి అవినీతి లేకుండా నేరుగా సంక్షేమం అందుతున్నా, సాంకేతిక సమస్యలు, ఇతర కారణాలతో కొందరు పథకాలకు నోచుకోవటం లేదని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. కుల, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ వంటి పత్రాలు లేని కారణంగా మరికొందరు పథకాలకు దూరమయ్యారని గుర్తుచేశారు. ఇలాంటి వారందరినీ గుర్తించి, వారికి కూడా ప్రయోజనం కల్పించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన ఫలితంగానే జగనన్న సురక్ష అనే గొప్ప కార్యక్రమం ఆచరణలోకి వచ్చిందన్నారు. జగనన్న సురక్షపై సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లకు గురువారం జరిగిన రెండోరోజు శిక్షణ తరగతులకు మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ, జగనన్న సురక్షలో భాగంగా నెలరోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 1.60 కోట్ల ఇళ్లను జల్లెడ పట్టనున్నట్టు చెప్పారు. 15 లక్షల క్యాంపులతో 1.50 లక్షల సచివాలయ సిబ్బంది, 2.60 లక్షల వలంటీర్లు, ఏడున్నర లక్షల గృహసారథులు 5.30 కోట్ల మందిని నేరుగా కలవబోతున్నారని చెప్పారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని 26 మంది ఐఏఎస్ అధికారులు పర్యవేక్షిస్తారని వివరించారు. నెలరోజుల ఈ కార్యక్రమాన్ని 75 లక్షలమంది ప్రజలు వినియోగించుకుంటారనేది ప్రభుత్వ అంచనాగా చెప్పారు. క్యాంపులకు ముందుగా వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా గృహసారధిని వెంటదీసుకుని ప్రతి ఇంటినీ సందర్శించాలని చెప్పారు. కౌలు గుర్తింపు కార్డులతో సహా పదిరకాల ధ్రువీకరణ పత్రాల ఆవశ్యకతను ప్రశ్నించి తెలుసుకోవాలని సూచించారు. అదే విధంగా సంక్షేమ పథకం ఏదైనా అందకపోయినా నమోదు చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయ్యాక జరిగే క్యాంపుల్లో అక్కడికక్కడే వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామని, సంక్షేమ పథకాలనూ మంజూరు చేస్తానమి ఎమ్మెల్యే చెప్పారు. వార్డు కౌన్సిలర్లు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు కూడా భాగస్వామ్యం తీసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాల్లో, గడపగడపకు మన ప్రభుత్వంలో జిల్లాలోనే అగ్రగామిగా ఉన్న తెనాలిని జగనన్న సురక్షలోనూ అగ్రగామిగా నిలపాలనీ, ప్రజలకు గరిష్టంగా ప్రయోజనం దక్కాలని స్పష్టంచేశారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, మండల తహసీల్దార్ కె.రవిబాబు కార్యక్రమం అమలుపై సూచనలు చేశారు. ఎంఎల్‌ఓ పి.చెన్నకేశవులు శిక్షణనిచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, అసిస్టెంట్ కమిషనర్ అనూష, మున్సిపల్ మేనేజరు కె.అప్పలరాజు, ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, భట్రాజు కార్పొరేషన్ డైరెక్టర్ రాళ్లబండి సుష్మ, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలపై 30న మహాధర్నా

తెనాలి: సంక్షోభంలో ఉన్న వ్యవసాయరంగాన్ని కాపాడుకునేందుకు, రైతాంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ జూన్ 30న విజయవాడలో జరగనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జొన్నా శివశంకరరావు కోరారు. స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం ముద్దన సాంబశివరావు అధ్యక్షతన తెనాలి కమిటీ సమావేశంలో శివశంకరరావు మాట్లాడారు. గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలు నష్టపోయిన రైతులందరికీ పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయాలని కోరారు. ఆహార పంటలకు ఎకరాకు రూ.10 వేలు, వాణిజ్యపంటలకు రూ.25 వేల చొప్పున ఇన్‌పుట్ సబ్సిడీని పెంచాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ చినరావూరు-జంపని మధ్య మూసివేసిన రైల్వే గేటును తెరిపించాలనీ, పంటకాల్వలు, మురుగు కాల్వల్లో తూటాకు, గుర్రపుడెక్కను వెంటనే తొలగించాలని కోరారు. కంచర్ల తారకేశ్వరరావు, అడపాల దుర్గాప్రసాద్ మాట్లాడారు.

తెనాలిలో రోటరీ క్లబ్ బోర్డు డైరెక్టర్ల ట్రైనింగ్ సెమినార్



హాజరైన డైరెక్టర్లు

తెనాలి: రోటరీ క్లబ్ బోర్డు డైరెక్టర్ ట్రైనింగ్ సెమినార్‌ను గురువారం సాయంత్రం సుల్తానాబాద్‌లోని రత్న ఫార్చ్యూన్ కళ్యాణమండపంలో నిర్వహించారు. ఆంధ్రా రీజియన్ పరిధిలోని 12 క్లబ్‌ల డైరెక్టర్లు పాల్గొన్న ఈ సదస్సును రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో నిర్వహించారు. రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్లు బూసిరెడ్డి శంకరరెడ్డి, తాళ్ల రాజశేఖరరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. రోటరీ క్లబ్ ద్వారా చేపడుతున్న సేవలను వివరించారు. పూర్వపు గవర్నర్లు అన్నే రత్నప్రభాకర్, పి.శ్రీమన్నారాయణ, రోటరీ ముఖ్యులు పి.విష్ణుబాబు, జీవీ మోహనరావు, అనిల్ చక్రవర్తి, పులివర్తి రమేష్, క్లబ్ ట్రైనర్ సుబ్బారావు, అసిస్టెంట్ గవర్నర్లు కన్నెగంటి మురళీకృష్ణ, ఎం.సుధీర్ బాబు, వై.వేణుగోపాల్, డి.వెంకటసురేష్ పాల్గొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం 2023-24 అధ్యక్షుడు పావులూరి రాంబాబు, కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, కోశాధికారి ఎంఎల్ జగదీశ్వరాంబ, జిల్లా కమిటీ సభ్యులు ఈదర వెంకట పూర్ణచంద్, డాక్టర్ డి.రవీంద్రనాథ్, చేతన్‌రాజ్ కొఠారి పర్యవేక్షించారు.

బూత్ లెవల్ అధికారులకు శిక్షణ

ఫిరంగిపురం: తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బూత్ లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎం. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం రూపొందించిన జాబితా ప్రకారం బూత్ లెవల్ అధికారులు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఓట్లు లేని వారిని గుర్తించాలని చెప్పారు. గుర్తించిన వారిచే ఓటు కోసం అప్లికేషన్లు పెట్టించాలన్నారు. ఇంటిడోరు నంబర్లు సరిగా ఉన్నదీ, లేనిదీ గమనించాలని చెప్పారు.

ఫోర్టిఫైడ్ బియ్యంతో మెరుగైన ఆరోగ్యం



పోస్టర్ విడుదల చేస్తున్న డీటీ కాకుమాను ప్రసాద్, సీఎస్ ఆర్ఐ కోటేశ్వరరావు

తాడికొండ: ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా అందించే ఫోర్టిఫైడ్ బియ్యంతో మెరుగైన ఆరోగ్యం, అనేక ప్రయోజనాలు ఉన్నాయని డెప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్ అన్నారు. అందరికీ మెరుగైన ఆరోగ్యం కోసం బలవర్ధక (ఫోర్టిఫైడ్) బియ్యం ప్రయోజనాలను తెలియజేసే ప్రక్రియలో భాగంగా తాడికొండలో సివిల్ సప్లయిస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పోస్టర్ విడుదల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఫోర్టిఫైడ్ బియ్యం, సాధారణ బియ్యం ఒకేలా ఉంటాయని, వండటం కూడా ఒకేలా వండి గంజి వార్చకుండా ఉడికించడం ద్వారా బహుళ ప్రయోజనాలు కలుగుతాయన్నారు. సివిల్ సప్లయిస్ ఆర్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ రేషన్ బియ్యంపై అపోహలు వీడి పోషకాహార లోపం అధిగమించి బలవర్ధకమైన ఆహారం అందించేందుకు ఏపీ ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం, చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో శర్మ, షేక్ సైదా పలువురు సివిల్ సప్లయిస్ సిబ్బంది పాల్గొన్నారు.